లెక్క పక్కా..



అమల్లోకి ఎఫ్ఐవీ యాప్..

వ్యవసాయ శాఖ రాష్ట్రంలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఎఫ్ఐవీ (ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్) అనే యాప్‌ను ప్రవేశ పెట్టింది. వరంగల్ జిల్లాలో ఈనెల 12నుంచి ఈ విధానం అమల్లోకి ఇచ్చినట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెపుతున్నారు. ఎరువుల కొరతను నివారించేందుకు ప్రభుత్వం ఎరువుల దుకాణాల వద్దకు వ్యవసాయ అధికారులు వారం రోజుల్లో రెండుసార్లు(సోమ, గురువారాల్లో) వెళ్లాలని సూచించింది. తద్వారా ఎరువుల కొరతకు కారణాలేంటనే దానిపై పరిశీలించి క్షేత్రసాయిలో లోపాలను గుర్తించి మరింత పారదర్శకంగా వ్యవస్థ ఉండేలా చేస్తోంది. ప్రత్యేక యాప్‌తో జిల్లాలోని ఎరువుల దుకాణాలను పరిశీలించి అక్రమ నిల్వలపై చర్యలు తీసుకోనున్నారు. డీలర్లు ఎరువుల కొనుగోళ్లు, అమ్మకాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయకుండా లెక్కతప్పితే అధికారులు ముందుగా నోటీసు అందిస్తారు. మిషన్ రిపేర్ లాంటివి జరిగినప్పుడు వెంటనే సమాచారం ఇచ్చి రిజిస్టార్‌లో సరిగ్గా నమోదు చేయాలి. వారంలో రెండు సార్లు అధికారుల తనిఖీల్లో ఎలాంటి తప్పులు దొర్లినా వెంటనే లైసెన్సును రద్దుచేసేలా ఉన్నతాధికారులు ఆదేశించారు.

- ఎఫ్ఐవీ యాప్‌ను తీసుకొచ్చిన ప్రభుత్వం
- ఎరువుల స్టాక్‌పై నిరంతర నిఘా
- వ్యవసాయ అధికారుల పనితీరుపై దృష్టి
- ఏవో నుంచి జేడీఏ వరకు ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు
- ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు

వర్ధన్నపేట రూరల్/ వర్ధన్నపేట, జనవరి 27: అన్నదాతలకు ఎరువుల కొరత లేకుండా చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపడుతోంది. ఎరువుల స్టాక్ లెక్క తప్పితే డీలర్ల లైసెన్సులను రద్దుచేయాలనే హెచ్చరికలు సైతం జారీ చేసింది. ఫర్టిలైజర్ షాపు డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి రైతులకు ఎరువులు అందకుండా చేసి, అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేయకుండా ఉండేందుకు ప్రత్యేక నిబంధనలను అమలులోకి తెచ్చింది. వ్యవసాయ అధికారుల పనితీరును కూడా ఎప్పటికప్పుడు తెలుసుకునేలా గూగుల్ యాప్ ద్వారా జీపీఎస్ విధానాన్ని అనుసరిస్తోంది. ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసిన అధికారి, ఆ షాపునకు వెళ్లినట్లుగా వెబ్‌సైట్‌లో పొందుపరి చేలా నిబంధనలు తీసుకొచ్చింది. వీటన్నింటిని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ కార్యాలయం నుంచి ఓ విభాగం ఎప్పటికప్పుడు గమనిస్తుంది. దీంతో ఎరువుల స్టాక్‌పై నిరంతర నిఘా ఉండడంతో పాటు వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయడంలో ఇటు వ్యవసాయ అధికారులు, అటు ఎరువుల దుకాణదారులు పారదర్శకంగా వ్యవహరించనున్నారు. కాగా, జిల్లాలో 337 ఎరువుల షాపులున్నాయి.

అధికారుల తనిఖీలు ఇలా...

జిల్లాలోని ఫర్టిలైజర్ షాపుల్లో ఉన్న ఎరువుల నిల్వలను అధికారులు పరిశీలించి వాటిని యాప్‌లో నిక్షిప్తం చేస్తారు. ఎరువుల బస్తాల వద్ద ఫొటోలు దిగి, స్టాక్ రిజిస్టార్‌లో సంతకం పెట్టి, ఆ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గతంలోనే షాపులను జీపీఎస్ ద్వారా ట్యాగ్ చేయడం జరిగింది. దీంతో షాపు వద్ద ఉండి గూగుల్ ద్వారా ఫొటో దిగి లొకేషన్‌ను కరెక్ట్‌గా పంపించాలి. దీని కోసం వారంలో సోమ, గురువారాల్లో మండల వ్యవసాయ అధికారి, ఏడీఏ, జిల్లా వ్యవసాయ అధికారి స్థాయి అధికారులు నెలలో ఐదుసార్లు దుకాణాలను తనిఖీ చేయాలి. జిల్లాలోని అధికారులకు వారి పరిధిలోని ఐదు షాపులను కేటాయించుకున్నారు. దుకాణాదారులు పీవోఎస్ యంత్రాలను ఉపయోగిస్తున్నారా లేదా, వాటి వివరాలు ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం నిర్వహణ ఉందో లేదో తెలియజేయాల్సి ఉంటుంది. దీంతో ఎరువుల విక్రయాల తీరు ను జిల్లా ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తారు. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి మాత్రమే యాప్‌లోకి లాగినయ్యే అవకాశం ఉంటుంది. దీంతో కిందిస్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రతీ దుకాణాన్ని తనిఖీ చేసి, పూర్తి వివరాలు పకడ్బందీగా నమోదు చేయాల్సిన అవసరం ఉంది.





వర్ధన్నపేటలో ఎరువుల తనిఖీ, ఇల్లందలో స్టాక్ వివరాలు ఆన్‌లైన్ చేస్తున్న ఏవో

షాపుల యజమానులపై విమర్శలు

ఎరువుల విక్రయం మొత్తం పీవోఎస్ యంత్రాల ద్వారా చేయాలని నిబంధనలున్నా కొందరు డీలర్లు నిబంధనలను విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పీవోఎస్ యంత్రాల్లో చూపించిన ఎరువుల నిల్వలు, భౌతిక నిల్వలకు మధ్య వ్యత్యాసాన్ని ఉన్నతాధికారులు గమనిస్తున్నట్లు తెలుస్తోంది. యంత్రాల్లో నిల్వలు భారీగా కనిపించడంతో సరిపడా ఎరువులు ఉన్నాయని భావించి కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయడంలేదు. వాస్తవానికి భౌతికంగా ఎక్కడా నిల్వలు లేకపోవడంతో రైతులకు యూరియా కొరత తలెత్తింది. యూరియా కోసం రైతులు కష్టాలు, ఆందోళన పడకుండా ఉండేందుకు ఈ యాప్‌ను అమల్లోకి తీసుకు వచ్చింది. దీని కోసం వ్యవసాయ అధికారులు కూడా సరైన రీతిలో తనిఖీలు చేసే కొత్త రూల్స్ పెట్టింది.

రైతుల కోసం కొత్త కార్యక్రమం..

భారత వాతావరణ శాఖ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మేలుచేసే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతీ ఒక్కరికి ప్రతీ ఇంటికి వాతావరణ సమాచారం అందించేందుకు సమాయాత్తం అయింది. ఈ క్రమంలోనే హర్‌హర్ మౌసం.. హర్‌ఘర్ మౌసం పేర కొత్త యాప్‌ను ఐఎండీ 150వ వార్షికోత్సవం సందర్భంగా రూపొందించింది. దీన్ని ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఇటీవల ఢిల్లీలో విడుదల చేశారు.

హైదరాబాద్ వాతావరణ కేంద్రంలోనూ అధికారులు ఇటీవల ఈ యాప్‌ను విడుదల చేసి అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలో ఈ విధానం పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించారు.

తొలగనున్న రైతుల ఇబ్బందులు

వానకాలం, యాసంగి సీజన్‌లలో ఎరువుల వినియోగం ఎక్కువగా ఉంటుంది. డీఏపీ, యూరియాను విరివిగా ఉపయోగిస్తారు. ఎక్కడికక్కడ నిల్వలపై కచ్చితమైన లెక్కలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. నిల్వలు తక్కువగా ఉంటే వెంటనే సరఫరా చేస్తుంది. దీనితో రైతులకు ఇబ్బందులు తలెత్తవు.

తనిఖీలు కొనసాగుతున్నాయి..

ఉషాదయాల్, జిల్లా వ్యవసాయ అధికారిణి



వరంగల్ జిల్లాలో ఎరువుల షాపుల్లో స్టాక్ నిల్వలపై తనిఖీలు కొనసాగుతున్నాయి. ఏవో, ఏడీఏలతో పాటు నేను కూడా ఎరువుల షాపులను యాప్ సాయంతో తనిఖీచేసి ఫోటోలను యాప్‌లో పొందుపరుస్తున్నాం. వారానికి ఐదు షాపులను తనిఖీచేసి వాటి వివరాలు నమోదు చేస్తున్నా. ఎరువులపై పారదర్శకంగా ఉండేలా అక్రమాలను అరికట్టేలా ప్రభుత్వం ఈ ఆలోచన చేసింది. ఎరువుల పట్ల. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఉండాలి.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- ప్రేమ విఫలమవడంతో మనస్తాపం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన తల్లి
- వరంగల్‌లో విషాదం



ముంజ అఖిల (ఫైల్)

వరంగల్ సిటీ, జనవరి 27: ప్రేమ విఫలమై ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ముంజ అఖిల(19) ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖిలావరంగల్ మండలంలోని పెరుకవాడలో శనివారం చోటుచేసుకుంది. మిల్స్‌కాలనీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతురాలి తల్లి ముంజ కోమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముంజ కోటి, కోమల దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కోటి గతంలోనే మృతిచెందగా తల్లి కోమల కూలి పనిచేసుకుంటూ పిల్లల్ని చదివిస్తోంది. అఖిల నగరంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. కొంతకాలంగా అఖిల ఓ యువకుడిని ప్రేమిస్తోంది. వీరి ప్రేమ విఫలమవడంతో దీంతో మనస్థాపం చెందిన అఖిల శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తల్లి కోమల ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు.



దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ అశ్విని

ప్రత్యేక గ్రీవెన్స్ వినతులను వెంటనే పరిష్కరించాలి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 28: ప్రత్యేక గ్రీవెన్స్‌లో స్వీకరించిన వినతులను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడ్ సూచించారు. శనివారం వరంగల్ కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు దివ్యాంగులు, వయో వృద్ధులకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 17 అర్జీలు రాగా 3 డీఆర్డీవో, 4 పౌరసరఫరాలు, 4 సంక్షేమ శాఖ, 1 ఎడ్యుకేషన్, 1 యువజన సర్వీసులు, 1 ఎంజీఎం, 1 ఉపాధి శాఖ, 1 కలెక్టర్‌కు, మరొకటి నల్లబెల్లి తహసీల్దారుకు అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ, సంక్షేమ అధికారి ఎం.శారద తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలను స్వీకరించిన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కిషన్



ప్రిన్సిపాల్‌కు బొకే అందిస్తున్న వైద్యులు గోపాల్, మనోజ్‌లాల్

నర్సంపేట, జనవరి 27 : నర్సంపేట ప్రభుత్వ వైద్య (మెడికల్) కళాశాల ప్రిన్సిపాల్‌గా బానోతు కిషన్ బాధ్యతలను స్వీకరించారు. వరంగల్ కాకతీయమెడికల్ కళాశాలలో పాథాలజీ ప్రొఫెసర్, హెచ్‌ఓడిగా పనిచేస్తున్న కిషన్ పదోన్నతిపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కిషన్‌ను ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఈ మేరకు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో విధుల్లో చేరినట్లు ప్రిన్సిపాల్ కిషన్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన కిషన్‌కు ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, డాక్టర్ మనోజ్‌లాల్ బొకే అందజేసి, అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న గంట రవికుమార్, నాయీబ్రాహ్మణులు

ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం గర్వకారణం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

మట్టెవాడ, జనవరి 27: జన నాయకుడు, సామాజిక న్యాయం కోసం అలు పెరుగని పోరాటం చేసిన కర్పూర్ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం గర్వకారణమ ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. శనివారం వరంగల్ చౌర స్తాలో నాయీబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు ఎలుగంటి సతీశ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం వరంగల్ చౌరస్తా నుంచి హెడ్ పోస్టాఫీసు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. కర్పూర్ ఠాకూర్ శతజయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వం భారతర త్న అవార్డు ప్రకటించడం హర్షనీయమన్నారు. నాయీబ్రాహ్మణ సామా జిక వర్గానికి చెందిన ఠాకూర్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తుచేశారు. 36 ఏళ్ల సుదీర్ఘకాలం ఓటమి ఎరగని ప్రజాప్రతిని ధిగా కొనసాగారన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీరాములు మురళీమనోహర్, కొలనుపాక కుమారస్వామి, నాగవెల్లి సునీల్,రమేశ్, సతీశ్, వేణు, నాగరాజు, సాంబమూర్తి, బీజేపీ నాయకులు పొట్టిశ్రీనివాస్‌గుప్తా, కుసుమ సతీశ్, చీటూరి అశోక్, బాకం హరిశంకర్, రాజేశ్వర్, కనుకుంట్ల రంజిత్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అన్నారంలో ఉర్సు ఉత్సవాలు ప్రారంభం

పర్వతగిరి, జనవరి 27: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నారం షరీఫ్‌లోని యాకూబ్‌షావలి దర్గా ఉర్సు ఉత్సవాలు శనివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో మొదటి రోజు ముజావరు బోలేషావలి ఇంటివద్ద హైదరాబాద్ నుంచి వచ్చిన బృందం సభ్యులు కవ్వాలి ఆకట్టుకుంది. దర్గాను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఆవరణలో విడిది చేశారు. గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ జెండా ఊరేగింపు తర్వాత సందల్ (గంధం) ఊరేగింపు నిర్వహించారు. గంధం ఊరేగింపు సందర్భంగా ఫకీర్ల విన్యాసాలు అలరించాయి. అనంతరం తెల్లవారు జామున దర్గాలో యాకూబ్‌షావలికి గంధం సమర్పించారు. పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు ఆధ్వర్యంలో 70మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తగిన ఏర్పాట్లు చేశారు.



జెండా ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బందోబస్తును పరిశీలించిన ఈస్ట్‌జోన్ డీసీపీ

ఉర్సు ఉత్సవాల్లో ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు చేపట్టిన బందోబస్తును ఈస్ట్‌జోన్ డీసీపీ పి.రవీందర్, మామునూరు ఏసీపీ సతీష్‌బాబులుశనివారం పరిశీలించారు. గ్రామానికి వచ్చే మూడుదారుల్లో ఏర్పాటు చేసిన మూడు పార్కింగ్ ప్రదేశాలను సందర్శించి పర్వతగిరి సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. దర్గాతో పాటు ప్రాంగణం, గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎప్పటికప్పుడు బందోబస్తును పర్యవేక్షించాలన్నారు. దర్గా ఎదురుగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సందర్శించి పలు శాఖల అధికారులతో సమీక్షించారు. కాగా, ఉత్సవాల సందర్భంగా రెండో రోజు భక్తులకు మహా అన్న దానం నిర్వహించనున్నట్లు వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పాషా తెలిపారు. సాయంత్రం 7గంటలకు దర్గాకు చెందిన సత్రంలో ప్రారంభమవుతుందన్నారు.



మేడారం వస్తున్నా..

- 23న వనదేవతలను దర్శించుకుంటా..
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- సచివాలయంలో మహాజాతర పోస్టర్ ఆవిష్కరణ
- సీఎంను సన్మానించిన పూజారులు
- సమస్యల పరిష్కారం కోసం వినతిపత్రం

ములుగు, జనవరి 27: మేడారం వనదేవతల మహాజాతరకు హాజరై సమ్మక్క, సారలమ్మలను దర్శించుకుంటానని, ఫిబ్రవరి 23న వస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. వనదేవతల వడ్డెలు(పూజారులు) సిద్ధబోయిన జగ్గారావు, కాక సారయ్య, కాక కిరణ్, చంద రఘుపతి రావు సీఎంను శనివారం కలిశారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి రాష్ట్ర సచివాలయంలో భేటీ అయ్యారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, దేవాదాయ, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల సమక్షంలో జాతరపోస్టర్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన్ను పూజారులు శాలువాతో సన్మానించారు. వనదేవతల పసుపు కుంకుమ, ప్రసాదాన్ని అందజేశారు. జాతరకు రావాలని ఆహ్వానించారు.



సీఎం రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న మేడారం పూజారులు

ఫిబ్రవరి 21 నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగుతుండగా వనదేవతలంతా గద్దెలపై కొలువున్న 23న మొక్కుల రోజున మేడారం వచ్చి దర్శనం చేసుకుంటానని సీఎం వారికి తెలిపారు.

వారసత్వ వాటా సమస్యను తీర్చాలి..

మేడారం వడ్డెలు(పూజారుల) సంఘం ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి పూజారులు వినతి పత్రం సమర్పించారు. వారసత్వ వాటా విషయంలో న్యాయ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. దేశ అత్యున్నత న్యాయ స్థానం తీర్పులు, హిందూ వారసత్వ చట్టాన్ని అనుసరించి పూజారుల కొడుకులకే వారసత్వ వాటా చెందేలా ప్రత్యేకఉత్తర్వులు జారీచేయాలని కోరారు.

పాలనా పరం గా మేడారం జాతర ప్రస్తుతం దేవాదాయ శాఖ అసిస్టెం ట్ కమిషనర్ పరిధిలో ఉందని, డిప్యూటీ కమిషనర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసి జాతర ప్రాంగణంలో శాశ్వత ఈవో కార్యాలయాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.

ధార్మిక భవానికి అమ్మల పేర్లు పెట్టాలి

వరంగల్‌లో గతంలో పూజారులకు ఇళ్ల స్థలాల కోసం కేటాయించిన భూమిలో రూ.కోటి మేడారం వాటా ధనంతో నిర్మించిన ధార్మిక భవనానికి సమ్మక్క, సారలమ్మల పేరు పెట్టాలని సీఎంను పూజారులు కోరారు.

భవనాన్ని మేడారం పరిధిలో ఉంచుతూ ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సమ్మక్క, సారలమ్మలను గద్దెకు చేర్చే సమయంలో మూ డంచెల భద్రత కల్పించాలని, ఆదివాసీ సంప్రదాయాల పై అవగాహన, కుల సంఘాలతో సత్సంబంధాలు కలి గిన ఐపీఎస్ అధికారులను నియమించాలని కోరారు. చిలుకలగుట్ట పవిత్రతను పరిరక్షించేందుకు సుమారు 50ఎకరాల గుట్టను కొందరు పూజారుల పేరున ఆర్‌వో ఎఫ్ఆర్

» మిగతా 6వ పేజీలో..

వనదేవతలకు మొక్కులు

మేడారం, జనవరి 27: సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ముందస్తు మొక్కులు సమర్పించుకున్నారు. జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి, కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. అనంతరం గద్దెలకు చేరుకుని మొక్కులు చెల్లించారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాడికో లిక్కర్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్ చంద్రారెడ్డి రూ.లక్ష800 ఈవో రాజేంద్రం అందజేశారు. కాగా, అభివృద్ధి పనుల పరోగతిని ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి పరిశీలించారు. హరిత హోటల్ పరిసర ప్రాంగణం, క్యూలైన్లు, వీధి దీపాల ఏర్పాట్ల పనులను పరిశీలించారు.

నర్సింగ్ శిక్షణకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

హనుమకొండ రూరల్, జనవరి 27: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక ఉపాధి శిక్షణ కింద జపాన్‌లో నర్సింగ్ సిబ్బంది శిక్షణ, నియామకం కోసం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం.మల్లయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 29వ తేదీన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తోందని 22 నుంచి 30 యేళ్ల వయస్సుగల బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం, డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు హైదరాబాద్ విద్యానగర్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్ ట్రెయినింగ్ సెంటర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే స్క్రీనింగ్ పరీక్షకు హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8919047600, 9573945684, 6302292450 లలో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా ప్రొఫెసర్ వెంకయ్య



కేయూ క్యాంపస్, జనవరి 27: కాకతీయ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీగా కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. వెంకయ్య గతంలో జంతుశాస్త్ర విభాగాధిపతిగా, బీవోఎస్ బోర్డు ఆఫ్ చైర్మన్‌గా, కేయూ క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, అడ్మిషన్ల డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. కేయూ హాస్టల్స్ డైరెక్టర్‌గా పనిచేశారు.

ఆటోను ఢీకొట్టిన లారీ - నలుగురికి గాయాలు


ప్రమాదంలో క్షతగాత్రులు

కురవి, జనవరి 27 : కురవి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆటోను లారీఢీకొన్న ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం. మాధవాపురం గ్రామానికి అరూరి వెంకన్న తన కుటుంబసభ్యులతో కలిసి ఆటోలో మహబూబాబాద్‌లో ఓ శుభకార్యంకు వెళ్తున్నారు. ఆటో కురవి వద్దకు చేరుకోగానే మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వెళ్తున్న లారీ ఆటోను ఢీకొట్టింది. ఈ ఘటనలో చిన్నారి బాబు అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. మరో చిన్నారి భానుతేజకు చేయి విరిగింది. అరూరి ఉపేంద్ర, అరూరి వెంకన్న, అనిల్‌లకు గాయాలయ్యాయి. ఎస్సై గోపి ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కస్నాతండాలో నల్లబెల్లం పట్టివేత

డోర్నకల్, జనవరి 27 : మండలంలోని కస్నాతండా వద్ద శనివారం నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లంతో పాటు 50 కిలోల పటికను పట్టుకున్నట్లు ఎస్సై యూనీస్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కస్నాతండా క్రాస్‌రోడ్డు వద్ద సమ్మక్క-సారలమ్మ గద్దెల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ నెంబర్‌ప్లేట్ లేని ఆటోను గుర్తించినట్లు చెప్పారు. దానిని తనిఖీ చేయగా అందులో నాలుగు క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. రవాణాకు ఉపయోగించిన ఆటోను సీజ్‌చేసి, ఇందుకు బాధ్యులైన బోరింగ్‌తండాకు చెందిన మోహన్, నాగేష్‌ను అదుపులోకి తీసుకోగా, కురవి మండలం లింగ్యాతండాకు చెందిన వెంకటేష్ పరారీలో ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

యువతిని మోసగించిన యువకుడిపై కేసు నమోదు

కొత్తగూడ, జనవరి 27: పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నా చేసిన ఘటన కొత్తగూడ మండలంలో శనివారం జరిగింది. యువతి (28)ని మోసగించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామంలో యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు జల్లెల ప్రశాంత్ పెళ్లి చేసుకుంటానని మూడేళ్లుగా ప్రేమించాడు. కాగా, ఆ యువతిని వివాహం చేసుకోవడానికి యువకుడు నిరాకరించాడు. దీంతో ప్రశాంత్ ఇంటి ఎదుట ఆ యువతి శనివారం బైఠాయించింది. పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేసింది. కాగా, పోలీస్‌స్టేషన్‌లో ప్రశాంత్‌పై యువతి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ తెలిపారు.

మరో ఐదేళ్లు ఉచిత బియ్యం

● ఈ నెల నుంచి ఉచిత పంపిణీ కొనసాగింపు ● ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9.57 లక్షల మందికి లబ్ధి



హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద రేషన్‌కార్డుదారులకు ఉచిత రేషన్ బియ్యం పంపిణీ కొనసాగింపు మళ్లీ ఈనెల నుంచి మొదలు కానున్నది. వచ్చే ఐదేళ్లవరకు ఇది కొనసాగుతుంది. ఉచిత బియ్యం పంపిణీకి అవసరమైన బియ్యంకోటా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చేరింది. పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీని కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్ల పాటు పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడంతో నిరుపేదలు, అట్టడుగువర్గాల వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత బియ్యం పంపిణీ ఈనెల నుంచి మళ్లీ అమలులోకి తీసుకువస్తూ గత ఉత్తర్వులు జారీ చేసింది. కొవిడ్-19 మహమ్మారి వ్యాప్తి సమయంలో పీఎంజీకేవై పథకాన్ని 2020 మార్చిలో కేంద్రం ప్రారంభించింది. కరోనా లాక్‌డౌన్ తర్వాత పేదలను ఆదుకోవడం కోసం, వారి జీవనోపాధికి ఆసరగా నిలిచేందుకు ఈ పథకాన్ని కేంద్రం ప్రవేశపెట్టింది.

పలుమార్లు పొడిగింపు

ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ (పీఎంజీకేఏవై) ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా మొదటి, రెండో దశల కింద ఉచిత బియ్యం పంపిణీని 2020 ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు అమలు చేశారు. ఆతర్వాత మూడో దశను మే నుంచి 2021 జూన్ వరకు పొడిగించారు. నాలుగోదశను 2021 జూలై నుంచి 2021 నవంబర్ వరకు, ఐదోదశను 2022 మార్చి వరకు, ఆరో దశను 2022 డిసెంబర్ వరకు, ఏడో దశను గత 2023 డిసెంబర్ వరకు కొనసాగించారు. ఇప్పుడు తాజాగా 2024 జనవరి మరో ఐదేళ్లపాటు కొనసాగిస్తారు. ఈ పథకానికి అయ్యే ఖర్చును రాష్ట్రాలతో సంబంధం లేకుండా కేంద్రమే భరిస్తోంది. 2022 డిసెంబరు 31న ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకెవై)ని జాతీయ ఆహార భద్రతాచట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)లో కేంద్రం విలీనం చేసింది. దీంతో అప్పటినుంచి ఆహార భద్రత కార్డు (రేషన్ కార్డు) ఉన్న లబ్దిదారులందరికీ ఉచిత రేషన్ బియ్యం పథకాన్ని కొనసాగిస్తోంది.

9.57 లక్షల మందికి లబ్ధి

వరంగల్, హనుమకొండ, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 9,57446మంది రేషన్ కార్డుదారులు ఉన్నారు. కేంద్ర నిర్ణయంతో ఆయా కుటుంబాలకు లబ్ధి చేకూరనున్నది. ఆహార భద్రత కార్డుదారులకు యూనిట్‌కు 6కిలోల చొప్పున, అంత్యోదయ కార్డుదారులకు 35కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న కార్డుదారులకు జనవరి నెలలో 19,290.47 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేటాయించారు. ఈబియ్యాన్ని ఈనెలలో పంపిణీ చేస్తారు.

అన్ని రేషన్ కార్డులకు..

అన్నపూర్ణ, అంత్య యోజన కార్డుదారులు, ఆహార భద్రతాకార్డు కలిగిన కుటుంబాలకు అన్ని రేషన్‌షాపులలో ఉచితంగా అందిస్తారు. కొవిడ్ మహమ్మారి సమయంలో విధించిన అదనపు నిబంధనలను కూడా తొలగించారు. కేంద్ర ప్రభుత్వం కొవిడ్‌కంటే ముందు రేషన్‌కార్డు ఉన్న వారికి కిలో బియ్యాన్ని సబ్సిడీ ధరతో రూ.1-3 వరకు అందించేది. ఐదు కిలోల చొప్పున ఒక్కొక్కరికి కేటాయించేది. అలాగే అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కుటుంబాలకు 35 కిలోల బియ్యాన్ని పంపిణీ చేసేది. అయితే ఈ స్కీమ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి కేంద్రం ఒక్క పైసా కూడా తీసుకోకుండా పేదలకు ఉచితంగా రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది.

ఉచిత బియ్యం పక్కదారి

ఈ ఉచిత బియ్యాన్ని రెండేళ్లుగా కార్డుదారులు అందరూ తీసుకోవడం లేదు. 70 నుంచి 80 శాతం కార్డుదారులు మాత్రమే ప్రతీ నెల తీసుకుంటున్నారు. మిగిలిన 20 నుంచి 30 శాతం కార్డుదారులు తమ కార్డులు రద్దుకాకుండా ఉండేందుకు రెండు నెలలకోసారి తీసుకుంటున్నారు. పదిశాతం [illegible] మంది కార్డుదారులు ఈ ఉచిత బియ్యాన్ని కిలో ఒక్కంటికి రూ.8 నుంచి రూ.10 లకు రేషన్‌షాపు డీలర్లకే విక్రయిస్తున్నారు. మిగిలిన 20శాతం కుటుంబాలు కిరాణం, ఇడ్లీ బండ్లు, చిరువ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

బెల్టుషాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు


పట్టుకున్న మద్యాన్ని చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

హనుమకొండ క్రైం, జనవరి 27: సుబేదారి పీఎస్ పరిధిలోని వడ్డెపల్లిలో అక్రమంగా విక్రయిస్తున్న బెల్టుషాపుపై వరంగల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈ దాడులలో రూ.74వేల విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డెపల్లిలోని పెసరు రాజ్‌కుమార్ అనే వ్యక్తి కొద్దిరోజులుగా ఇంటినే అడ్డాగా చేసుకుని బెల్టుషాపు నడిపిస్తున్నట్టు పక్కా సమాచారం అందింది. దీంతో శనివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేసి రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఇంట్లో డంప్ చేసిన వివిధ బ్రాండ్లకు సంబంధించిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పట్టుకున్న మద్యాన్ని సుబేదారి పోలీసులకు అప్పగించారు. ఈ దాడులలో టాస్క్‌ఫోర్స్ పోలీసులతో పాటు సివిల్ పోలీసులు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీతారాంనాయక్ తదితరులు

జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

మాజీ ఎంపీ సీతారాంనాయక్

వడ్డెపల్లి, జనవరి 27: సామాజిక స్పృహ కలిగిన జర్నలిస్టులు ప్రజాస్వామ్యాన్ని పరక్షించాలని ప్రముఖ బంజారా నేత, మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించినన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు బానోతు వెంకన్న, జిల్లా అధ్యక్షుడు గుగులోతు హుస్సేన్ నాయక్, కార్యదర్శి దేవేందర్ నాయక్, జర్నలిస్టులు అంతడుపుల శ్రీనివాస్, రోజనాల శ్రీనివాస్, శోభన్‌బాబు, మాడ నర్సయ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం


విద్యుదాఘాతంతో దగ్ధమైన ఇల్లు

పరకాల, జనవరి 27: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన పరకాల పట్టణంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పరకాల పట్టణానికి చెందిన నేరెళ్ల పరశురాంకు చెందిన ఇంట్లో ఫ్రిడ్జి ప్లగ్ షార్ట్ సర్క్యూట్ జరిగి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో పెద్ద ఎత్తున మంటలు లేచాయి. ఇది గమనించిన చుట్టుపక్కల ప్రజలు స్థానిక ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వెంటనే చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటి వరకే ఇంట్లో ఉన్న ఫ్రిడ్జితోపాటు ఇంటి పైకప్పు, ఇంట్లోని సమాన్లతోపాటు డబ్బులు మంటల్లో కాలిపోగా, రూ. 2 లక్షల వరకు ఆస్థి నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.

శివనగర్‌లో భారీ చోరీ

15 తులాల బంగారం, 25 తులాల వెండి, 45వేల నగదు అపహణ

ఖిలావరంగల్, జనవరి 27: వరంగల్ అండర్ బ్రిడ్జి ప్రాంతం శివనగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో శుక్రవారం రాత్రి భారీ చోరీ జరిగింది. శనివారం ఉదయం ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం. వరంగల్ రైల్వే స్టేషన్ శివనగర్ ఎదురుగా ఉన్న ఇంట్లో వ్యాపారం (బాటర్ బాటిల్ అమ్మకం) పూజారి రవి-శ్రీలత దంపతులు ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుండగా, వారు హైదరాబాద్‌లో ఉంటున్నారు. రవికి అనారోగ్యం కారణంగా దంపతులు మూడు రోజుల క్రితం వైద్యపరీక్షల నిమిత్తం రాజస్థాన్‌కు వెళ్లారు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి 15తులాల బంగారం, 25తులాల వెండి, 45వేల నగదు అపహరించారు. బంగారం, వెండి, నగదు కలిపి సుమారు కోటి రూపాయల దొంగతనం జరిగినట్లు తెలిపారు. శనివారం ఉదయం రవి తమ్ముడి భార్య ఇంట్లోని చెట్లకు నీళ్ల పట్టే క్రమంలో ఇంటికి వేసిన తాళాన్ని పగలకొట్టి ఉండడం చూసి, మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారమిచ్చింది. పూజారి భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం విషయాన్ని పోలీసులు రవి కుటుంబానికి సమాచారమిచ్చారు. వారి చెప్పిన దాని ప్రకారం చోరీ అంచనా వేశారు. కేసును సీఐ సురేష్ దర్యాప్తు చేస్తున్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

పర్వతగిరి, జనవరి 27 : మండలంలోని దౌలత్‌నగర్‌లో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ బి.వీరన్న, ఆర్గనైజర్ పిండి కొమురయ్యలు క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, సర్పంచ్ కొల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మొదటి రోజు 13 జట్లు పాల్గొన్నాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు బండి వెంకటేశ్వర్లు, పిండి మల్లికార్జున్, కత్తుల శ్రీనివాస్, నల్గొండ సూర్యప్రకాష్, ఎస్సెమ్సీ చైర్మన్ బొమ్మెర సుధాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలి

జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

ఘనంగా ఏకశిల పాఠశాలల వార్షిక వేడుకలు



హసన్‌పర్తి, జనవరి 27: విద్యార్థులు విశ్వ విజేతలుగా ఎదగాలని, మారుతున్న పోటీ ప్రపంచంలో తమ గమ్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా కోరారు. హసన్‌పర్తి మండలం పెంబర్తి వద్ద గల ఏకశిలా టెక్నో స్కూల్‌లో శనివారం ఏకశిలా పాఠశాలల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఏ రంగంలోనైనా గొప్ప వక్తులుగా తయారవుతారన్నారు. ఉన్నత స్థానానికి చేరి నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగినప్పుడే కీర్తించబడుతారన్నారు.

అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి ఎం.డి. అబ్దుల్‌హై మాట్లాడుతూ.. దేశాభివృద్ధిలో తరగతి గది పాత్ర ప్రధానమైనదన్నారు. విద్యార్థులను సక్రమమైన పద్ధతిలో, క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఏకశిలా విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఏకశిలా విద్యా సంస్థల ద్వారా విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతిలో 10/10 జీపీఏ, సీబీఎస్ఈలో 485 మార్కులు సాధించిన విద్యార్థులకు ఏకశిలా జూనియర్ కళాశాలలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్లు గౌరు సువిజారెడ్డి, బేతి కొండల్ రెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సీహెచ్ దినేష్‌రెడ్డి, బేతి శైలజ, స్వప్నరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఆత్మకూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వినియోగదారుల మండలి ప్రతినిధులు

పెద్దాపురంలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోండి..

ఆత్మకూరు తహసీల్దార్‌కు వినియోగదారుల మండలి ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం పెద్దాపురం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ జరుగుతోందని వియోగదారుల మండలి రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి నల్లా రాజేందర్ శనివారం ఆత్మకూరు తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి కలిసి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ (నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్)లు లేకుండా మైనింగ్ సంస్థలు బ్లాక్‌గ్రానైట్‌ను తీస్తున్నాయని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెద్దాపురం మైనింగ్ సంబంధించి ఎన్‌వోసీలు దొరకడం లేదని అధికారులు చెబుతున్నారని తెలిపారు. సర్వే నెంబరు 584/1లో రెండు మైనింగ్ సంస్థలు మైనింగ్ శాఖ చేసుకున్న అగ్రిమెంట్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఇప్పటికీ రెండు సంస్థలు పర్యావరణ నిబంధనలు అతిక్రమించిందువల్ల న్యాయస్థానాలు జరిమానా విధించాయని, లోకాయుక్తలో విచారణ జరుగుతున్నదని తెలిపారు. అయినా కూడా నిబంధనల ప్రకారం మైనింగ్ నిర్వహించకపోవడంపై రెవెన్యూశాఖ ఇకనైనా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నెంబరు 584/లో 2008 నుంచి మైనింగ్ జరుగుతున్న క్రమంలో అక్కడ ఉన్న గుట్ట అతి పెద్ద బిలంగా మారిపోయి స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. అనంతరం ధరణి పోర్టల్‌కు సంబంధించిన ఫిర్యాదులను తహసీల్దార్‌కు ఇచ్చారు.

వైద్యం కోసం సాయం చేయండి..


మాట్లాడుతున్న నాగరాజు, మౌనిక

వడ్డెపల్లి, జనవరి 27: తమ కుమారుడి వైద్యం కోసం సహాయం చేయాలని ములుగు జిల్లా చల్వాయి గ్రామానికి చెందిన నాగరాజు, మౌనిక దంపతులు వేడుకుంటన్నారు. ఈ మేరకు హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. త కుమారుడు లక్ష్మణ్ ఇటీవల ఆడుకుంటూ కిందపడడంతో తలకు తీవ్ర గాయాలై ఫిట్స్ రావడం ప్రారంభం అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే హనుమకొండలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. లక్ష్మణ్‌కు వెంటిలేటర్‌పై వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజుకు రూ.55 నుంచి 60వేల వరకు ఖర్చు అవుతోందని చెప్పారు. ప్రయివేట్ ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న తాము కుమారుడి వైద్య ఖర్చులు భరించే స్థోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దాతలు ముందుకొచ్చి తమ కుమారుడికి ప్రాణబిక్ష పెట్టేందుకు ఆర్థిక సహకారం అందించాలని నాగరాజు, మౌనిక వేడుకుంటున్నారు. ఫోన్‌పే నంబర్ 8008994920కు ఆర్థికసాయం పంపించాలని వారు కోరారు.



నరసింహుడిని దర్శించుకున్న రేవూరి

గీసుగొండ, జనవరి 27: గీసుగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ అభివృద్ధి కోసం తనవంతు కృషిచేస్తానన్నారు. రిటైర్డ్ బ్యాంకు మేనేజరు పెగళ్లపాటి లక్ష్మీ నారాయణ స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏనుగుల సాంబరెడ్డి, అర్చకులు నరసింహాచార్యులు, మురళీకృష్ణాచార్యులు, నాయకులు చాడా కొమురారెడ్డి, సంజీవరెడ్డి, దౌడు భరత్, ప్రశాంత్‌రెడ్డి, బోడకుంట్ల రాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న రేవూరి

ప్రభుత్వ భూమిలో నిర్మాణాన్ని కూల్చివేస్తున్న బల్దియా సిబ్బంది



పుల్లయ్యకుంటలో ఆక్రమణల తొలగింపు

శంభునిపేట, జనవరి 27 : రంగశాయిపేటలోని పుల్లయ్యకుంట వద్ద గల ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని జీడబ్ల్యూఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం కూల్చివేశారు. ఉర్సు రెవెన్యూ శివారులోని 140 సర్వే నెంబరు ప్రభుత్వ భూమిలోని ఎకరం స్థలాన్ని గతంలో బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయానికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ స్థలంలో పార్టీ కార్యాలయానికి భూమి పూజ చేశారు. ఆ భూమి అన్యాక్రాంతమైనట్టు జరుగుతున్న ప్రచారంలో భాగంగా గురువారం ఆ ప్రాంతాన్ని రెవెన్యూ, మునిసిపల్ శాఖ అధికారులు పరిశీలించారు. ఆ ప్రాంతంలోని ఓ నిర్మాణాన్ని అక్రమ నిర్మాణంగా గుర్తించి శనివారం కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతలకు విఘాతం కలుగకుండా ఏసీపీ బోనాల కిషన్, స్థానిక మిల్స్‌కాలనీ సీఐ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు చేపట్టారు. అనంతరం ఈ స్థలం ప్రభుత్వ స్థలమని అతిక్రమిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలుపుతూ ఫెక్సీని ఏర్పాటు చేశారు. కూల్చివేత కార్యక్రమంలో మునిసిపల్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

● చట్ట ప్రకారం కొన్నా: స్థల యజమానులు

పుల్లయ్యకుంటలోని 141 సర్వే నెంబరు భూములు ప్రభుత్వానివి కావని, చట్ట ప్రకారం కొనుగోలు చేశామని స్థల యజమానులు వాపోతున్నారు. శనివారం టౌన్ ప్లానింగ్ సిబ్బంది చేపట్టిన కూల్చివేతలను నిరసిస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ... నిబంధనల ప్రకారం లింక్ డాక్యుమెంట్లు, చెల్లించిన పన్నులు, రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించినా కూల్చివేస్తున్నారని వాపోయారు. 2005 నుంచి ఇంటి నెంబరుతో రేకుల షెడ్డు వేసి వ్యాపారాలు చేసుకుంటున్నామని, ఎల్‌ఆర్‌ఎస్ కూడా చెల్లించామని పేర్కొంటున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వ భూమి అని చెప్పి కూల్చివేతలు చేపట్టడం తగదన్నారు. కార్యక్రమంలో బాధితులు కుసుమ కేదారి, చిన్నపల్లి కవిత, కందునూరి పద్మ, మదూరి చేరాలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

- నగరంలో కానరాని నిబంధనలు
- ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు
- పట్టించుకోని టౌన్ ప్లానిగ్ అధికారులు
- అడపాదడపా కూల్చివేతలతోనే సరి..
- రూల్స్ పాటించడం లేదని కార్పొరేటర్ల వసూళ్లు

మట్టెవాడ, జనవరి 27: వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నా అధికారులు పూర్తి స్థాయిలో కొరడా ఝులిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడపాదడపా అక్కడక్కడ ఒకటి రెండు అక్రమ కట్టడాలను కూల్చిడం.. ఆ తర్వాత తమ పనైపోయిందన్నట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా వరంగల్ నగర వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ అనుమతులపై విజిలెన్స్ ఆరాతీస్తోంది. సంవత్సర కాలంగా గ్రేటర్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీనిపై ప్రతీ వారం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు వస్తున్నా, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు టౌన్‌ప్లానింగ్ అధికారులపై రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఎక్కువ అయ్యాయి. గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ లీడర్ వరకు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు అక్రమ నిర్మాణదారులకు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. నిర్మాణదారులు అడ్డదారుల్లో వెళ్తూ తమ పనిని సాగిస్తున్నారు.

అక్రమ వసూళ్ల దందా..

భవన నిర్మాణాలు మొదలు పెట్టే సమయంలో స్థానికంగా ఉండే కొంత





వరంగల్ ములుగు రోడ్డులో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్, డీఆర్‌ఎస్ సిబ్బంది

మంది కార్పొరేటర్లు నిర్మాణం జరిగే ప్రాంతానికి వచ్చి అనుమతి ఉందా అనే ప్రశ్నలతో సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. భవన నిర్మాణం అనుమతి ఉంటే ఒకరేటు, లేకుంటే మరో రేటు అంతస్థుల సంఖ్యను బట్టి నగరంలో వసూళ్లు సాగుతున్నాయి. కొంతమంది కార్పొరేటర్లు, వారి అనుచరులు నిర్మాణదారులను జలగల్లా పీడిస్తున్నారు. వీరి తీరుతో యజమానులు హడలెత్తిపోతున్నారు.

లెక్కగట్టి రేట్లు ..

అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ఇళ్లు, వాణిజ్య భవనాలు ఇలా కేటగిరీలా విభజించి అంతస్థుల వారీగా రేట్లను నిర్ణయించి కొంత మంది కార్పొరేటర్లు వసూళ్లకు తెగబడుతున్నారు. భవన నిర్మాణం మొదలు పెట్టారంటే చాలు.. గద్దల్లా వాలిపోతారు. విస్తీర్ణం, ఇంటి నిర్మాణ ఖర్చు అంచనా వేసి రేట్లను నిర్ణయించి అడిగింతా ఇవ్వాల్సిందేనని, లేకపోతే భవన నిర్మాణం అనుమతి లేదనో, సెట్ బ్యాక్ నిబంధన పాటించలేదనో ఇలా ఏదో ఒక సాకుతో నిర్మాణ పనులకు అడ్డుపడుతున్నట్టు ప్రచారం సాగుతోంది. ప్రజలకు, అధికారులకు వారధిగా ఉండాల్సిన కొంతమంది కార్పొరేటర్లు అడ్డగోలుగా వసూళ్లకు తెగబడుతున్నారనే విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణాలకు కార్పొరేటర్లే పరోక్షంగా వత్తాసు పలుకుతునట్టు పలువురు ఆరోపిస్తున్నారు. అడిగింతా ఇస్తే చాలు ఎన్ని అంతస్థులైనా నిర్మించుకోవచ్చనే అభయం ఇస్తున్నారు. తిల పాపం తల పిడికెడు అన్నట్లుగా కొంతమంది టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, కార్పొరేటర్లు వాటాలు పంచుకుంటున్నారు. ఎవరైనా ఇంటి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగానే నిర్మాణ సామగ్రి నిర్మాణం జరిగే ప్రాంతంలో ఉండటంతో స్థానికంగా కొంతమంది కార్పొరేటర్లు వివరాలు సేకరిస్తున్నారు. కొంత మంది టౌన్ ప్లాన్ సిబ్బంది కొంత మంది కార్పొరేటర్లకు ఆదాయం సమకూర్చి పెట్టడమే పనిగా మార్చుకున్నారు. నిర్మాణాలు మొదలైతే తనిఖీల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు.

పాత భవనాలపై కొత్త అంతస్థులు..

వరంగల్ ప్రాంతంలో పాత భవనాలపైన కొత్త అంతస్థుల నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎంతో కొంత ముట్టజెప్పితే యదేచ్ఛగా నిర్మించుకోవచ్చనే భావనతో భవన యజమానులు అడిగినంత ఇస్తున్నారనే తెలిసింది.

నగరవ్యాప్తంగా అక్రమా గోల..

నగరవ్యాప్తంగా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. వరంగల్ ప్రాంతంలో ఓసిటీ కాలనీలో, కాశిబుగ్గ ప్రధాన రహదారి, వివేకానందకాలనీ, సొసైటీ కాలనీ, ఎల్బీ నగర్, సంతోష్‌మాత కాలనీ, బృందావన్ కాలనీ, వరంగల్ చౌరస్తా, వరంగల్ చౌరస్తా లబ్బీదొడ్డి, జేపీఎన్ రోడ్డు, గాంధీ నగర్, మణికంఠ కాలనీ, లేబర్ కాలనీ, మార్కెట్ 100 ఫీట్ల రోడ్డులో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలతోపాటు నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థుల నిర్మాణాలు సాగుతున్నాయి. వీటన్నింటిపై విజిలెన్స్ ప్రత్యేక దృష్టి సారించి వివరాలను సేకరిస్తునట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా ఎన్ని భవనాలు ఉన్నాయనే వివరాలను సేకరిస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా ఎన్ని నిర్మాణాలు చేపట్టారు అనే విషయంపై లోతుగా విజిలెన్స్ శాఖ విచారణ చేస్తున్నట్లు తెలిసింది.



మాట్లాడుతున్న స్వామి వివేకానంద పరివాజక్

ఈశ్వరుడి ధ్యానంతోనే శాంతి

స్వామి వివేకానంద పరివాజక్

మట్టెవాడ, జనవరి 27: మానసిక ఒత్తిడి, అశాంతిని అధిగమించడానికి ఈశ్వరుడి ధ్యానంతోనే సాధ్యమని స్వామి వివేకానంద పరివాజక్ అన్నారు. శనివారం రాత్రి వరంగల్ ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో అధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ- యువత డబ్బే ప్రధానమని భావిస్తోందని, డబ్బుతో సుఖాన్ని ఆనందాన్ని పొందాలేమన్నారు. జీవితానికి అవసరమైన ధనాన్ని మాత్రమే సంపాదించాలని మంచి పనులు చేస్తూ సుఖాన్ని ఆనందాన్ని పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్య సమాజ్ ప్రముఖులు బండి కిషన్‌రావు, జయప్రకాశ్, ఆల్లోజు వెంకటేశ్వర్లు, ధర్మతేజ, నరేందర్ ఆర్య పాల్గొన్నారు.

క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్‌గా రత్నరాజు



రత్నరాజుకు నియామక పత్రాన్ని ఇస్తున్న రాష్ట్ర చైర్మన్ రవికుమార్

మట్టెవాడ, జనవరి 27: తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్‌గా చెరుకూరి రత్నరాజును నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ శనివారం నియామక పత్రాలను అందచేశారు. రామన్నపేటలోని జీజస్ గ్రేస్ చర్చిలో ఉమ్మడి జిల్లా క్రిస్టియన్ జేఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చెరుకూరి రత్నరాజు, కన్వీనర్ జన్ను ప్రభాకర్, కో చైర్మన్ మాట్ల రాజు, కో ఆర్డినేటర్‌గా కోట జాషువా, అధికార ప్రతినిధిగా చింత కృపాల్, ఈసీ మెంబర్లుగా జన్ను జాన్, బాస్కుల దేవన్నలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మేకల సారయ్య జన్ను ఇర్మియా, రత్నరాజు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ శోభాదేవికి సన్మానం



ప్రిన్సిపాల్ శోభాదేవిని సత్కరిస్తున్న అధ్యాపకులు

శంభునిపేట, జనవరి 27 : రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శోభాదేవి జిల్లా ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికవగా, శనివారం కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న ఆమెకు సన్మాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో అధ్యాపకులు రజిత, వీరాంజన్ కుమార్, మల్లారెడ్డి, సుధాకర్, ఎల్లస్వామి, మహాలక్ష్మీ, అనిల్, నరేష్, రూపారాణి, మమత, హాలూనాయక్ పాల్గొన్నారు.

ఉత్తములకు సన్మానం



కనకస్వామిని సన్మానిస్తున్న బాలకిశోర్‌రెడ్డి

గీసుగొండ, జనవరి 27: విధుల్లో అంకితభావంతో మనుగొండ ప్రాథమికోన్నత పాఠశాలలో ఒక్క లీవ్ వాడుకోకుండా పనిచేసిన ఉపాధ్యాయుడు కనక స్వామిని స్థానికులు శనివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు అల్లం బాలకిశోర్‌రెడ్డి, హెచ్ఎం ప్రసాద్, కొమ్ము శ్రీకాంత్, క్రాంతి, సాయి, రాజేష్, ఎస్ఎంసీ సభ్యులు మొగసాని శంకర్, బరుపటి అనిల్ పాల్గొన్నారు. అలాగే ఐకేపీలో పనిచేస్తూ ఉత్తమ సీసీగా అవార్డు తీసుకున్న కక్కెర్ల సుజాతను అభినందించారు.

నీటి ఎద్దడిని తీర్చాలని ఖాళీ బిందెలతో నిరసన



కోటలో తాగునీటిని సక్రమంగా విడుదల చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

ఖిలావరంగల్, జనవరి 27: ఖిలావరంగల్ ఎస్సీకాలనీలో నీటి విడుదల విషయంలో సమయపాలన పాటించాలని 37వ డివిజన్ ఎస్సీకాలనీ అధ్యక్షుడు షైదం రవి ఆధ్వర్యంలో మహిళలు ఖాళీ బిందెలతో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఉదయం వేళల్లో నీటి విడుదల చేయాలని మహిళలు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో విడుదలవుతున్న తాగునీరు పైపులు పగలడంతో రోజుకోమారు రావాల్సిన నీరు వారం రోజులకోమారు కూడా రావడంలేదన్నారు. అలాగే రాత్రి 10 నుంచి 11వరకు నీటిని లైన్‌మెన్ విడుదల చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మహిళలు గడిపె లక్ష్మమ్మ, దర్శనాల పాపమ్మ, గడిపె స్వరూప, గొర్రె మమత, షైదం రమ, షైదం రాధిక, షైదం బాబు, దర్శనాల సుబాష్, గడిపె జగదీష్, సుద్దాల నాగరాజు, బరిగెల రాజు, నలిగంటి కిషోర్, కేశపాక రాజు, మేకల రాజు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

వరంగల్‌టౌన్, జనవరి 27: ఉపాధి, ఉద్యోగ భద్రత సోషల్ సెక్యూరిటీ కల్పించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆరెల్లి కృష్ణ, ఎం.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఎల్బీనగర్ ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఐఎఫ్‌టీయూ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ- కార్మికుల కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానన్ని పునరుద్ధరించాలన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ఈ డిమాండ్స్‌తో ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో జరుపతలపెట్టిన భారీ ర్యాలీని కార్మికులందరు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సీతారామయ్య, రాసిద్దున్, అనురాధ, శివ, శ్రీధర్, వరదయ్య, మదర్, సాయిల్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చెన్నారావుపేట, జనవరి 27 : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహ త్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని నెంబర్ వన్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై పస్తం శ్రీనువాస్ కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన సాదు చిరంజీవి(35) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని గురిజాలకు చెందిన శిరీషతో వివాహం జరిగిం ది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మూడేళ్లుగా కుటుంబంలో కలహాలు జరుగుతుండడంతో ఏడాది న్నర క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. తనకు ఉన్న 30గుంటల వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేయగా, పంటలు సరిగా పండక నష్టపోయి ఆర్థికం గా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డా డు. మృతుడి తండ్రి కొంరయ్య ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనువాస్ తెలిపారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రజక నాయకులు

నర్సంపేట, జనవవరి 27 : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రజ క వృత్తిదారుల సమాఖ్య (టీఆర్‌వీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లందుల సాంబయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద శనివారం టీఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రజక ఫెడరేషన్‌కు వెంటనే పాలక మండలి ని ఏర్పాటుచేసి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. రజక వృత్తిదారులకు ఉన్న అన్ని ప్రభుత్వ జీవోలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల ద్వారా అమలయ్యేలా చూడాలన్నారు. 50 ఏళ్ళు నిండిన ప్రతీ రజక వృత్తి దారుడికి రూ.3వేల పింఛన్ మంజూరీచేయడంతో పాటు దోభీఘాట్ల పరిరక్షణకు, మౌలిక వసతుల కొరకు నిధులు కేటాయించాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్ బాండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ప్రతిష్ఠించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొల్లూరి లక్ష్మీనారాయణ, రాయరాకుల శ్రీను, గడ్డమీది బాలకృష్ణ, గుడికందుల సదానందం, రమేశ్, మామిడాల కాంతయ్య, వావిల్ల ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్ష

హనుమకొండ రూరల్, జనవరి 27: ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామన్ జయంతి, జాతీయ గణిత దినోత్సవా న్ని పురస్కరించుకొని తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్షను హంటర్‌రోడ్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో నిర్వహించారు. ముందుగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. గణితం నిత్యజీవితంలోనూ ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు. గణితాన్ని చిన్నతనంలో అలవర్చుకుంటే చాలా సులభంగా ఉం టుందన్నారు. గణిత ప్రతిభ పరీక్షలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, డాక్టర్ అడ్లూరి నరసింహామూర్తి, రామేశ్వర్ రావు, గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు తవుటం భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మహేశ్, పుల్లూరు మల్లికార్జున్, రఘురాం, కంది శ్రీనివాస్‌రెడ్డి, కందగట్ల సురేశ్, ఆనంద్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎంపీపీ



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ సౌజన్య

గీసుగొండ, జనవరి 27: కొనాయిమాకులలో మసీదు వద్ద మండల పరిషత్ నిధులు రూ.1.50 లక్షలతో నిర్మించే డ్రైయినేజీ, శ్మశానవాటిక వద్ద రూ. 1.5 లక్షలతో నిర్మించే మినీ వాటర్‌ట్యాంక్, బోరు పనులను ఎంపీపీ భీమగాని సౌజన్య శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రజాపాలన ద్వారా అభయహస్తం ఆరు గ్యారంటీలను దశల వారీగా కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు ఎమ్డీ రహీంపాష, కార్యదర్శి సుమలత, నాయకులు చాడా కొమురారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాస్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు వజ్ర రాజు, కొమ్మాల దేవస్థానం ఉత్సవ కమిటీ డైరెక్టర్ పీసాల రాజేశ్వర్ రావు, సంతోష్, వెంకటేశ్, తిరుపతి, రాజు, ఉపేందర్, మల్లాజీ, మార్గం రాజు, పోలీస్ మనోహర్, శంకర్‌రావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కనీసవేతనం రూ.26 వేలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

గీసుగొండ, జనవరి 27: కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల సర్వసభ్య సమావేశం శనివారం గీసుగొండలో రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం గత పదేళ్లుగా కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలను అలంబిస్తోందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు టి. బ్రహ్మచారి, రాజు, వజ్ర, చినగారి రాజు, శ్రీనివాస్, సంజీవ, ప్రకాష్, రమేష్ పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులను వేగంగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ రూరల్, జనవరి 27: కాళోజీ కళాక్షేత్రం పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బాలసముద్రంలో నిర్మిస్తున్న కాళోజీ కళాక్షేత్రం పనులపై కుడా అధికారులు, నిర్మాణ పనులు చేపడుతున్న ఏజెన్సీ ప్రతినిధులతో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడిటోరియం, హాల్, ఇతర భవన నిర్మాణ పనుల పురోగతిపై అడిగి తెలుసుకున్నారు. గడువులోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా, కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ భీంరావు, కుడా అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్స్ యూనియన్ కమిటీలు రద్దు

కాళోజీ జంక్షన్, జనవరి 27: తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర, జిల్లా, మండల, పట్టణ కమిటీలన్నీ రద్దు చేస్తున్నట్లు తాడు రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గుడిమల్ల రవికుమార్, కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి దార సూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర ఆటోడ్రైవర్స్ యూనియన్‌ను మరింత బలోపేతం చేయడం కోసం కమిటీలన్నీ రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే సీనియర్ నాయకులు, ఆటో డ్రైవర్లను సంప్రదించి నూతన కమిటీల ఏర్పాటుకు సలహాలు, సూచనలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మేడారం వస్తున్నా..

3వ పేజీ తరువాయి

పట్టా చేయడం జరిగిందని, దీనిని వనదేవతల పేరున బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన శాశ్వత వసతు లు కల్పించాలని, ప్రతీసారి పనులకు ఆటంకం కలిగిస్తున్న అటవీ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పూజారులు విజ్ఞప్తి చేశారు. పగిడిద్ద రాజు, గోవిందరాజులు ఉండే పూను గొండ్ల, కొండాయిని మాత్రమే దేవాదాయ గుర్తింపును ఇచ్చిందని, బయ్యక్కపేట, దొడ్ల గ్రామాలలోని ఆలయాలను కూడా ఎండోమెంట్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవింద రాజుల పూజారుల కోసం దేవాదాయ ద్వారా శాశ్వత గదులను కేటాయించాలన్నారు. పుణ్యస్నానాల సమయంలో జంపన్న వాగులో ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జాతర జరిగే నాలుగు రోజుల్లో వనదేవతల గద్దెలపై పోలీసులు, మీడియా ప్రతినిధులు డ్రోన్ కెమెరాలు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు 15రోజుల ముందే బెల్లం, మద్యం, కొబ్బరి కాయల దుకాణాలను కేటాయించాలని కోరారు. పూజారులకు హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL ఆదివారం 28 జనవరి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య



చిరంజీవి (ఫైల్)

చెన్నారావుపేట, జనవరి 27 : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలోని నెంబర్ వన్ కాలనీలో చోటుచేసుకుంది. ఎస్సై వస్తం శ్రీనువాస్ కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన సాదు చిరంజీవి(35) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మండలంలోని గురిజాలకు చెందిన శిరీషతో వివాహం జరిగిం ది. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. మూడేళ్లుగా కుటుంబంలో కలహాలు జరుగుతుండడంతో ఏడాది న్నర క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. తనకు ఉన్న 30గుంటల వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేయగా, పంటలు సరిగా పండక నష్టపోయి ఆర్థికం గా ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కొంరయ్య ఫిర్యాదు మేరకు శవాన్ని పోస్టుమార్టానికి తరలించి, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనువాస్ తెలిపారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రజక నాయకులు

నర్సంపేట, జనవవరి 27 : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని తెలంగాణ రజ క వృత్తిదారుల సమాఖ్య (టీఆర్‌వీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లందుల సాంబయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద శనివారం టీఆర్‌వీఎస్ ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రజక ఫెడరేషన్‌కు వెంటనే పాలక మండలి ని ఏర్పాటుచేసి జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని ఆయన కోరారు. రజక వృత్తిదారులకు ఉన్న అన్ని ప్రభుత్వ జీవోలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల ద్వారా అమలయ్యేలా చూడాలన్నారు. 50 ఏళ్ళు నిండిన ప్రతీ రజక వృత్తి దారుడికి రూ.3వేల పింఛన్ మంజూరీచేయడంతో పాటు దోబీఘాట్ల పరిరక్షణకు, మౌలిక వసతుల కొరకు నిధులు కేటాయించాలన్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బాండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహ ప్రతిష్ఠించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొల్లూరి లక్ష్మీనారాయణ, రాయరాకుల శ్రీను, గడ్డమీది బాలకృష్ణ, గుడికందుల సదానందం,రమేశ్, మామిడాల కాంతయ్య, వావిల్ల ప్రసాద్‌కుమార్ పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



స్వయం పాలనలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఖానాపురం, జనవరి 27 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. డీఈవోగా యశ్వంత్, డిప్యూటీ ఈవోగా అభినయ్‌సాయి, ఎంఈవోగా కార్తిక్‌చౌదరి, ఎంఎస్‌వోగా విజయ్‌కుమార్, హెచ్‌ఎంగా హర్షవర్ధన్‌లు వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దొడ్డ విజయ, నాయుడు, ఉపాధ్యాయులు వజ్రం, కరంచంద్, సోమలక్ష్మి, రవికుమార్, వేములపల్లి రాంమోహన్‌రావు, మల్లయ్య, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీఆర్డీవో శ్రీనివాస్

ఖానాపురం, జనవరి 27 : మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికాభివృద్ధిని సా ధించాలని అదనపు డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల సమాఖ్య కార్యాలయంలో వీవోఏల సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలోని వీవోఏలు సెర్ప్ కార్యక్రమాలైన సంఘాల సమావేశాలు, షెడ్యూల్ ప్రకారం రోజువారి అకౌంటింగ్ ఎంట్రీ పూర్తిచేయాలన్నారు. రుణాలు అవసరం ఉన్న సంఘాలను గుర్తించి రుణాలు ఇప్పించాలన్నారు. కార్యక్ర మంలో ఏపీఎం కందిక సుధాకర్, డీపీఎంలు దయాకర్, చంద్రశేఖర్, భవాని, మండల సమాఖ్య ప్రతినిధులు కవిత, క్రిష్ణకుమారి, జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పట్టభద్రుల మండల కన్వీనర్‌గా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న హరిబాబు

ఖానాపురం, జనవరి 27 : కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల మండల కన్వీనర్‌గా మండ ల కేంద్రానికి చెందిన గుండ్రాతి శ్రీనివాస్‌ను నియమించినట్లుగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు శనివారం తెలిపారు. అదేవిధంగా కో-కన్వీనర్‌లుగా కోడి మల్లేష్, లావుడియా రమేష్, మండల ఇన్‌చార్జిలుగా నందగిరి రజినీకాంత్, దోనాల కృపాకర్‌రెడ్డి, గాదె రాజు, కెల్లపు విష్ణు, షేక్ జాఫర్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు ముస్తఫా, షేక్ లాల్‌సాబ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేస్తున్న తహసీల్దార్ ఫణికుమార్

చెన్నారావుపేట, జనవరి 27 : తెలంగాణ గొర్రెల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) జిల్లా కమిటీ ముద్రణ చేసిన నూతన క్యాలెండర్ ఆవిష్కరణను శనివారం చేపట్టారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్ క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అమీనాబాద్ సర్పంచ్ సిద్దెన రమేష్, జిల్లా కార్యదర్శి ఫరికి మధుకర్, మండల కార్యదర్శి జక్క రవి, గౌరవ సలహాదారుడు ఆవుల రాములు, ఉపాధ్యక్షుడు దొంగల రాజుకుమార్, మండల నాయకులు జక్క వెంకన్న, తోగరు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆస్పత్రి భవన నిర్మాణాన్ని పూర్తిచేయాలి

• ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి



నర్సంపేట శివారులో 250 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, జనవరి 27 : నర్సంపేటలోని సర్వాపురం శివారులో నిర్మిస్తున్న 250 పడకల జిల్లాస్థాయి ఆస్పత్రి నిర్మాణ పనులను, వైద్య కళాశాల నిర్మాణ స్థలాన్ని శనివారం ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు, వైద్యులతో కలిసి ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ 250పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఇంజరీంగ్ అధికారులను ఆయన ఆదేశించారు. వైద్య కళాశాల భవన నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరంలో వైద్య విద్యను అభ్యసించే విద్యార్థుల కొరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మూడు నెలల్లో వైద్యశాల ప్రజలకు అందుబాటులోకి వచ్చే విధంగా పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. వైద్య కళాశాలకు స్థలం కేటాయించడంతో పాటు రైతులు పంట పొలాలకు వెళ్ళేందుకు దారి, ఆస్పత్రికి వెళ్ళేందుకు వేర్వేరుగా దారులను ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. ఆస్ప త్రి నిర్మాణం నాణ్యత ప్రమాణాలు, ఆస్పత్రికి సంబంధించిన పత్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రంలో ఆర్డీఓ కృష్ణవేణి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, డాక్టర్ మనోజ్‌లాల్, తహసీల్దార్ శివప్రసాద్, ఇంజనీరింగ్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయం మార్క్సిజమే

ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్



గిర్నిబావిలో మాట్లాడుతున్న మద్దికాయల అశోక్ ఓంకార్

దుగ్గొండి, జనవరి 27 : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యామ్నాయం మార్క్సిజమేనని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్‌ఓంకార్ అన్నారు. గిర్నిబావిలో శనివారం జిల్లా కమిటీ వర్క్‌షాపు సమావేశానికి కుసుంబ బాబురావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా అశోక్‌ఓంకార్ మాట్లాడారు. పదేళ్లలో దేశంలో కార్పొరేట్, పెట్టుబడిదారి ఆర్థిక విధానాలతో దేశ ప్రజలపై ఆర్థిక భారం పడుతోందన్నారు. మతాన్ని వ్యక్తిగత విశ్వాసం నుంచి మత రాజకీయంగా బీజేపీ చేస్తోందన్నారు.పెట్టుబడి దారి బూర్జువా పార్టీలను ప్రజలు తిరస్కరించాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో వామపక్ష ఐక్యత, సామాజిక న్యాయ సాధనకై ప్రజా సంఘాలను బలోపేతం చేయాలన్నారు. జనవరి 30న రాష్ట్ర వ్యాప్తంగా మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల విధి విధానలపై చర్చించేందుకు ఫిబ్రవరి 2 నుంచి 5 వరకు తమిళనాడులోని కన్యాకుమారిలో ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, కేంద్ర కమిటీ సభ్యుడు గొనె కుమారస్వామి, రాష్ట్ర కమిటీ సభ్యులు మంద రవి, నర్ర ప్రతాప్, నాగెల్లి కొంరయ్య, వంగాల రాగసుధ, యుపీఎస్‌ఎం రాష్ట్ర కార్యదర్శి కన్నం వెంకన్న, నాయకులు సుంచు జగదీశ్వర్, కందికొండ కుమారస్వామి, కొత్తకొండ రాజమౌళి, కలకొట్ల యాదగిరి, జన్ను రమేశ్, సింగతి మల్లికార్జున్, బత్తిని కుమారస్వామి, ఎల్లబోయిన రాజు, గటిక జమున, బుడిమె సురేందర్, అల్లి సాహెబ్, ఐలోని, గాజుల వెంకటయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందిస్తున్న రతీష్

పర్వతగిరి, జనవరి 27 : మండలంలోని వడ్లకొండ గ్రామ రంగనాయకస్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి వరంగల్‌కు చెందిన తేనె సుష్మ-రతీష్ దంపతులు రూ.1,00,116 విరాళంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అమడగాని రాజుయాదవ్, స్వామిరావు, అలుగునూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సర్వేయర్‌కు సన్మానం



శ్రీవిద్యను సన్మానిస్తున్న తహసీల్దార్ ఫణికుమార్, సిబ్బంది

చెన్నారావుపేట, జనవరి 27: మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న శ్రీవిద్య ఉత్తమ సర్వేయర్‌గా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య నుంచి అవార్డు అందుకోవడంతో, శనివారం తహసీల్దార్ ఫణికుమార్ తన సిబ్బందితో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తమ సేవలందించి అవార్డును అందుకోవటం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ కొండ మల్ల రవికుమార్, ఆర్ఐ స్వామి, జూనియర్ అసిస్టెంట్ అంజాద్‌ఖాన్, వీఆర్‌ఏలు శోభ తదితరులు పాల్గొన్నారు.

మేడారం వస్తున్నా..

(3వ పేజీ తరువాయి)

పట్టా చేయడం జరిగిందని, దీనిని వనదేవతల పేరున బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

• మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన శాశ్వత వసతులు కల్పించాలని, ప్రతీసారి పనులకు ఆటంకం కలిగిస్తున్న అటవీ శాఖ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డిని పూజారులు విజ్ఞప్తిచేశారు. పగిడిద్ద రాజు, గోవిందరాజులు ఉండే పూను గొండ్ల, కొండాయిని మాత్రమే దేవాదాయ గుర్తింపు ఇచ్చిందని, బయ్యక్కపేట, దొడ్ల గ్రామాలలోని ఆలయాలను కూడా ఎండోమెంట్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవింద రాజుల పూజారుల కోసం దేవాదాయ ద్వారా శాశ్వత గదులను కేటాయించాలన్నారు. పుణ్యస్నానాల సమయంలో జంపన్న వాగులో ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలుతీసుకోవాలని తెలిపారు. జాతర జరిగే నాలుగు రోజుల్లో వనదేవతల గద్దెలపై పోలీసులు,మీడియా ప్రతినిధులు డ్రోన్ కెమెరాలు ఉపయోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు 15రోజుల ముందే బెల్లం, మద్యం, కొబ్బరికాయల దుకాణాలను కేటాయించాలని కోరారు. పూజారులకు హెల్త్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించి ఇండ్లు నిర్మించి ఇవ్వాలన్నారు.

పాఠశాలకు మైక్ సెట్టు బహూకరణ



మైక్‌సెట్టును బహూకరిస్తున్న దాతలు

పర్వతగిరి, జనవరి 27 : మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు వరంగల్‌కు చెందిన అలయ న్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్, వరంగల్ వారి ఆధ్వర్యంలో వైర్‌లెస్ మైక్‌సెట్టును శనివారం బహూకరించారు. సర్పంచ్ చింతపట్ల మాలతిసోమేశ్వర్‌రావు మాట్లాడుతూ పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి ఉపకరణాలను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కతీజుల్ ఖుబ్రా, నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం రమేష్, క్లబ్ గవర్నర్ లింగమూర్తి, డీటీఎఫ్ జిల్లా కార్యదర్శి మహంకాళి రామస్వామి, మండల ప్రధాన కార్యదర్శి కందగట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరుడి ధ్యానంతో శాంతి : స్వామి వివేకానంద పరివాజక్

మట్టెవాడ, జనవరి 27 : మానసిక ఒత్తిడి, అశాంతిని అధిగమించడానికి ఈశ్వరుడి ధ్యానంతోనే సాధ్యమని స్వామి వివేకానంద పరివాజక్ అన్నారు. శనివారం రాత్రి వరంగల్ ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో వరంగల్‌లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో అధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. యువత డబ్బే ప్రధానమని భావిస్తోందని, డబ్బుతో సుఖాన్ని ఆనందాన్ని పొందలేమన్నారు. జీవితానికి అవసరమైన ధనాన్ని మాత్రమే సంపాదించాలని మంచి పనులు చేస్తూ సుఖాన్ని, ఆనందాన్ని పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్య సమాజ్ ప్రముఖులు బండి కిషన్‌రావు, జయప్రకాశ్, ఆల్లోజు వెంకటేశ్వర్లు, దర్మతేజ, నరేందర్ ఆర్య పాల్గొన్నారు.

యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

• నగరంలో కానరాని నిబంధనలు
• యథేచ్ఛగా భవన నిర్మాణాలు
• పట్టించుకోని టౌన్ ప్లానిగ్ అధికారులు
• అడపాదడపా కూల్చివేతల తోనే సరి..
• నిబంధనలు పాటించడంలేదని కార్పొరేటర్ల వసూళ్ల దందా

మట్టెవాడ, జనవరి 27: వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాలు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు సాగుతున్నా అధికారులు పూర్తి స్థాయిలో కొరడా ఝులిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడపాదడపా అక్కడక్కడ ఒకటి రెండు అక్రమ కట్టడాలను కూల్చిడం.. ఆ తర్వాత తమ పనైపోయిందన్నట్టు వ్యహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా వరంగల్ నగర వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ అనుమతులపై విజిలెన్స్ ఆరాతీస్తోంది. సంవత్సర కాలంగా గ్రేటర్ పరిధిలో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. దీనిపై ప్రతీవారం గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదులు వస్తున్నా, టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు టౌన్‌ప్లానింగ్ అధికారులపై రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఎక్కువ అయ్యాయి. గల్లీ లీడర్ నుంచి ఢిల్లీ లీడర్ వరకు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది, అధికారులు అక్రమ నిర్మాణదారులకు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టిన వారికి నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. నిర్మాణదారులు అడ్డదారుల్లో వెళ్తూ తమ పనిని సాగిస్తున్నారు.

• అక్రమ వసూళ్ల దందా..

భవన నిర్మాణాలు మొదలు పెట్టే సమయంలో స్థానికంగా ఉండే కొంత మంది కార్పొ రే టర్లు నిర్మాణం జరిగే ప్రాంతానికి వచ్చి అనుమతి ఉందా అనే ప్రశ్నలతో సాధారణ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. భవన నిర్మాణం అనుమతి ఉంటే ఒక రేటు, లేకుంటే మరో రేటు అంతస్థుల సంఖ్యను బట్టి నగరంలో వసూళ్ల సాగుతున్నాయి. కొంతమంది కార్పొరేటర్లు, వారి అనుచరులు నిర్మాణదారులను జలగల్లా పీడిస్తున్నారు. వీరి తీరుతో యజమానులు హడలెత్తిపోతున్నారు.

• లెక్క గట్టి రేట్లు ..

అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ఇళ్లు, వాణిజ్య భవనాలు ఇలా కేటగిరీలా విభజించి అంతస్థుల వారీగా రేట్లను నిర్ణయించి కొంత మంది కార్పొరేటర్లు వసూళ్లకు తెగబడుతున్నారు. భవన నిర్మాణం మొదలు పెట్టారంటే చాలు.. గద్దల్లా వాలిపోతారు. విస్తీర్ణం, ఇంటి నిర్మాణ ఖర్చు అంచనా వేసి రేట్లను నిర్ణయించి అడిగింతా ఇవ్వాల్సిందేనని, లేకపోతే భవన నిర్మాణం అనుమతి లేదనో, సెట్ బ్యాక్ నిబంధన పాటించలేదనో ఇలా ఏదో ఒక సాగుతో నిర్మాణ పనులకు అడ్డుపడుతున్నట్టు ప్రచారం సాగుతోంది.

ప్రజలకు, అధికారులకు వారధిగా ఉండాల్సిన కొంతమంది కార్పొరేటర్లు అడ్డగోలుగా వసూళ్లకు తెగబడుతున్నారనే విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణాలకు కార్పొరేటర్లే పరోక్షంగా వత్తాసు పలుకుతునట్టు పలువురు ఆరోపిస్తున్నారు. అడిగింతా ఇస్తే చాలు ఎన్ని అంతస్థులైనా నిర్మించుకోవచ్చనే అభయం ఇస్తున్నారు. తిల పాపం తల పిడికెడు అన్నట్లుగా కొంత మంది టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, కార్పొరేటర్లు వాటాలు పంచుకుంటున్నారు. ఎవరైనా ఇంటి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగానే నిర్మాణ సామగ్రి నిర్మాణం జరిగే ప్రాంతంలో ఉండటంతో స్థానికంగా కొంత మంది కార్పొరేటర్లు వివరాలు సేకరిస్తున్నారు. కొంత మంది టౌన్ ప్లాన్ సిబ్బంది కొంత మంది కార్పొరేటర్లకు ఆదాయం సమకూర్చి పెట్టడమే పనిగా మార్చుకున్నారు. నిర్మాణాలు మొదలైతే తనిఖీల పేరిట వసూళ్లకు పాల్పడుతున్నారు.

• పాత భవనాలపై కొత్త అంతస్థులు..

వరంగల్ ప్రాంతంలో పాత భవనాలపైన కొత్త అంతస్థుల నిర్మాణాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. టౌన్ ప్లానింగ్ అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఎంతో కొంత ముట్టజెప్పితే యథేచ్ఛగా నిర్మించుకోవచ్చనే భావనతో భవన యజమానులు అడిగినంత ఇస్తున్నారనే తెలిసింది.

• నగర వ్యాప్తంగా అక్రమాల గోల..

నగర వ్యాప్తంగా యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. వరంగల్ ప్రాంతంలో ఓసిటీ కాలనీలో, కాశిబుగ్గ ప్రధాన రహదారి, వివేకానందకాలనీ, సొసైటీ కాలనీ, ఎల్బీ నగర్, సంతోష్‌మాత కాలనీ, బృందావన్ కాలనీ, వరంగల్ చౌరస్తా, వరంగల్ చౌరస్తా లక్ష్మీదొడ్డి, జేపీఎన్ రోడ్డు, గాంధీ నగర్, మణికంఠ కాలనీ, లేబర్ కాలనీ, మార్కెట్ 100 ఫీట్ల రోడ్డులో యదేచ్ఛగా అక్రమ నిర్మాణాలతోపాటు నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్థుల నిర్మాణాలు సాగుతున్నాయి. వీటన్నింటిపై విజిలెన్స్ ప్రత్యేక దృష్టి సారించి వివరాలను సేకరిస్తునట్లు తెలిసింది.

నిబంధనలకు విరుద్ధంగా ఎన్ని భవనాలు ఉన్నాయనే వివరాలను సేకరిస్తున్నారు. అనుమతులకు విరుద్ధంగా ఎన్ని నిర్మాణాలు చేపట్టారు అనే విషయంపై లోతుగా విజిలెన్స్ శాఖ విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందేలా చూడాలి

• ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



రాయపర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి, జనవరి 27 : ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 98మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీచేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయా శాఖలు మెరుగ్గా పనిచేస్తున్నాయని తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చూడడంలో సఫలీకృతమవుతున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో రెండు గ్యారంటీలు అమల్లోకి వచ్చాయని, త్వరలోనే మరిన్ని గ్యారంటీలు అమలు చేస్తామన్నారు. ప్రతీ ఒక్కరికి పారదర్శకంగా పథకాలు అందేలా చూడడంలో అధికారుల పాత్ర ముఖ్యమన్నారు. రాయపర్తి మండలాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిచేసుకుని ముందుకు వెళ్దామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, జడ్పీటీసీ రంగు కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలి



సన్నాహక సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

వర్ధన్నపేట రూరల్, జనవరి 27 : రాబోయే వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల గ్యాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తలు సత్తా చాటాలని వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ రత్నం సతీష్‌షా సూచించారు. శనివారం మండలంలోని ఇల్లందలో వర్ధన్నపేట నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020 అక్టోబరు నెలకు ముందు పట్టభద్రులైన వారిని గుర్తించి ఓటు హక్కు పొందేలా కార్యకర్తలు కృషిచేయాలన్నారు. గతంలో ఓటరుగా ఉన్నవారిని కూడా రెన్యూవెల్ చేసుకునేలా చైతన్యం చేయాలన్నారు. ఈసారి విద్యావంతులైన ప్రతీ ఒక్కరు బీజేపీ అభ్యర్థికి ఓటువేసేలా చూడాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, కో-ఆర్డినేటర్స్ కుడికాల శ్రీధర్, పెద్దూరి రాజ్‌కుమార్, పర్వతగిరి మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్, డివిజన్ల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రిషియన్ దినోత్సవం



మాట్లాడుతున్న ఈఏఎం అధ్యక్షుడు రాము

వర్ధన్నపేట, జనవరి 27 : వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో ఎలక్ట్రిషియన్ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలక్ట్రిషియన్ అసోసియేషన్ మండల (ఈఏఎం) అధ్యక్షుడు కోమలగిరి రాము మాట్లాడుతూ ప్రపంచానికి చీకటిని పారద్రోలి వెలుగును ప్రసాదించిన మహానుభావుడు థామస్ అల్వా ఎడిసన్ అని తెలిపారు. థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎలక్ట్రిషియన్ అసోసియేషన్ నాయకులు ఆర్.వాసుదేవరెడ్డి, మహేందర్ రెడ్డి, తక్కళ్లపల్లి విష్ణు ప్రసాద్, దాసరి భిక్షపతి, బాలాజీ, రాకేశ్, సాంబమూర్తి, ఎల్లగౌడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కళారంగానికి తీరని లోటు

• ప్రముఖ గాయకుడు, సినీ గేయ రచయిత గిద్దె రాంనర్సయ్య



లింగగిరిలో వేణు సంస్మరణ సభలో మాట్లాడుతున్న గిద్దె రాంనర్సయ్య

చెన్నారావుపేట, జనవరి 27 : కళాకారుడు కనుకుల వేణు గుండెపోటుతో మృతిచెందడం కళారంగానికి తీరని లోటని ప్రముఖ గాయకుడు, సినీగేయ రచయిత గిద్దె రాంనర్సయ్య అన్నారు. శనివారం మండలంలోని లింగగిరిలో రచయిత తాళ్ల సునీల్ ఆధ్వర్యంలో వేణు సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళారంగంలో ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. గ్రామంలో అందరితో ఆప్యాయతగా మాట్లాడే వేణు హఠాత్తుగా మరణించడం అందరినీ కలిచివేసిందన్నారు. ఎంతో చలాకిగా మాట్లాడే ఆయన మన అందరినీ వీడిపోవడం చాలా దూరదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కంబాల సత్యనారాయణ, పడిదం రాజేందర్, గాదేపాక బాబు, బక్కి యాదగిరి, మేర్గు బాబు, పెరుమాండ్ల శ్రీనువాస్, డప్పు లక్ష్మణ్, యాకాంతం, కనక రాజు, దిలీప్, వెంకన్న, శాతదాసి సురేష్ తదితరులు పాల్గొన్నారు.